జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు
ఎడిటర్ : 90520 45435

బుధవారం 31-12-2025 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :215 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : కాసే అమృత

## బెంగాల్ సర్కార్ వల్లే సరిహద్దుల్లో కంచె వేయలేకపోతున్నాం: అమిత్ షా



పశ్చిమ బెంగాల్‌లో భాజపా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. మమతా బెనర్జీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు.
ఎన్నికల ప్రయోజనం కోసం టీఎంసీ పార్టీ బంగ్లాదేశీయుల చొరబాట్లను ప్రోత్సహిస్తోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని ఇవ్వకపోవడం వల్లే భారత్–బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కేంద్రం కంచె వేయలేకపోతోందని ఆరోపించారు. సరిహద్దుల్లో చొరబాట్లు కేవలం బెంగాల్‌కు సంబంధించిన సమస్య మాత్రమే కాదని.. మొత్తం దేశానికి సంబంధించిన సమస్యని అన్నారు. పేజి 2లో

## సంస్కరణల ఎక్స్‌ప్రెస్'లో భారత్ ప్రయాణం

### మోదీ 2025 రివైండ్



దిల్లీ: 2025 చివరకు వచ్చేసింది. ఇంకొన్ని గంటల్లో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్నాం. ఈ సందర్భంగా ఈ ఏడాది భారత ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుర్తుచేసుకున్నారు. ఇది సంస్కరణల సంవత్సరమని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. “సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌లో భారత్ ప్రయాణం ప్రారంభించింది. ఈ ఏడాది వివిధ రంగాల్లో తీసుకొచ్చిన గణనీయమైన మార్పులు.. పేజి 2లో

## అమిత్‌షా వ్యాఖ్యలను ఖండించిన మమతాబెనర్జీ



2లో

# తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందడి

### అర్ధరాత్రి నుంచే ప్రత్యేక దర్శనాలు
### భారీగా తరలివచ్చిన ప్రముఖులు
### సిఎం రేవంత్ రెడ్డి, కేంద్ర, రాష్ట్ర మంత్రుల దర్శనం






తిరుమలతెలుగు రాష్ట్రాల్లో ముక్కోటి ఏకాదశి సందడి నెలకొంది. పలు దేవాలయాల్లో ఉత్తరద్వారాలు తెరుచుకోవడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి 12:05 గంటలకు వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. ఇప్పటికే శ్రీవారి కొండకు తరలివచ్చిన భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలకు ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ, సినీ ప్రముఖులు ఉత్తర ద్వారం గుండా ఆ గోవిందుడిని దర్శించుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శ్రీవారిని దర్శించుకున్నారు. అనేక మంది రాజకీయ, సినీ ప్రముఖులు తెల్లవారుజామునే ఉత్తర ద్వారం గుండా శ్రీనివాసుడి దర్శనం చేసుకున్నారు.ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు, మంత్రులు నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, అనగాని సత్య ప్రసాద్, కొల్లు రవీంద్ర, సవిత, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖ, బాలకృష్ణ సతీమణి వసుంధర, నటులు రాజేంద్ర ప్రసాద్, నారా రోహిత్, శివాజీ, హీరోయిన్ శ్రీలీల, నటి హేమ, నిర్మాతలు డి.వి.వి దానయ్య, బండ్ల గణేష్, ఇండియన్ క్రికెటర్ తిలక్ వర్మ, సూర్య కుమార్ యాదవ్, చాముండేశ్వరి నాథ్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్, కళ్యాణి, దువ్వాడ శ్రీనివాస్, మాధురి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా, ఎంపీలు మిథున్ రెడ్డి, డీకే అరుణ, ఎమ్మెల్యేలు రాజాసింగ్, మల్లారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

## కొత్త జిల్లాల ఏర్పాటుపై నోటిఫికేషన్ జారీ

### కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాల ఏర్పాటు
### కొత్త జిల్లాలతో 28కి పెరిగిన జిల్లాల సంఖ్య



రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తుది నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదల చేసింది. ఏపీలో కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేసినట్లు, మార్కాపురం కేంద్రంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇక రాష్ట్రంలో 5 కొత్త రెవెన్యూ డివిజన్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపింది. దీనివల్ల రాష్ట్రంలోని రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల్లో మార్పులు జరిగాయి. పేజి 2లో

## తిరుపతి ఆలయాల్లో భక్తుల రద్దీ



ఏపీ వ్యాప్తంగా పలు దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారాలు తెరుచుకున్నాయి. వేకువజామునే భక్తులు ఆలయాలకు తరలివచ్చి ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు. అటు తిరుమలలోనూ గత అర్ధరాత్రి నుంచే వైకుంఠ ద్వారాలు తెరుచుకోగా.. ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఇక తిరుపతిలోని శ్రీనివాస మంగాపురం శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభమైంది. అర్ధారాత్రి 1:35 గంటలకు ఉత్తర ద్వారాలు తెరుచుకున్నాయి. పేజి 2లో

## తిరుమలలో ఆధ్యాత్మిక పరిమళాలు

స్వర్ణరథంపై ఊరేగిన మలయప్పస్వామి




2లో

## సంక్రాంతికి మరో 11 ప్రత్యేక రైళ్లు: దక్షిణ మధ్య రైల్వే



2లో

## గ్రూప్-1 కేసులో ముగిసిన వాదనలు.. జనవరి 22న తీర్పు



2లో

## చంద్రబాబు చరిత్ర రాయాలంటే పేజీలు సరిపోవు

### చంద్రబాబుపై పుస్తకావిష్కరణలో ఎంపి కేశినేని




విజయవాడ,డిసెంబరు : సీఎం చంద్రబాబు నాయుడు చరిత్ర రాయాలంటే ఎన్ని పేజీలు అయినా సరిపోవని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. మంగళవారం నాడు ఆంధ్రప్రదేశ్ 15 ఏళ్ల ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించిన చంద్రబాబు పేరుతో బాయన శేఖర్ బాబు రాసిన పుస్తకాన్ని ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంగా చంద్రబాబు చేసిన సేవలను గుర్తు చేసేలా రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించినందుకు ఆనందంగా ఉందన్నారు. పేజి 2లో

# గోదావరి- బనకచర్లపై గట్టిగా పోరాడింది మేమే: హరీశ్‌రావు

**ప్రభుత్వ వైఖరిపై విమర్శ:** గోదావరి-బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని తాము పోరాడుతుంటే, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం కేంద్ర సమావేశంలో సంతకాలు చేసి వచ్చి బయట అబద్ధాలు చెబుతున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు.

**కమిటీ నియామకం:** చంద్రబాబు నాయుడు కమిటీ వేసిన వారానికే రేవంత్‌రెడ్డి కూడా ఒక కమిటీ వేశారని, అందులో ఆరుగురు సభ్యులు ఆంధ్రప్రదేశ్‌తో సంబంధం ఉన్నవారేనని ఆయన ఆరోపించారు.

**నీటి వాటా వివాదం:** గోదావరి నీటిని కృష్ణాలో కలిపితే తెలంగాణకు అదనపు నీరు రావాల్సి ఉంటుందని, కానీ ఏపీ ప్రభుత్వం ఆ నీటిని నల్లమల సాగర్‌కు తరలించాలని చూస్తోందని పేర్కొన్నారు.



హైదరాబాద్: గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు అన్యాయం జరుగుతుందని గట్టిగా పోరాటం చేశామని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. “బనకచర్ల విషయంలో కేంద్రం ఏర్పాటు చేసిన సమావేశానికి వెళ్లొద్దని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించాం. పేజి 2లో

## గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నరెన్స్‌కు మారాలి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: ఓఆర్ఆర్ లోపల ప్రాంతాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని జీహెచ్ఎంసీ కొత్త జోనల్ కమిషనర్లకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. కొత్త జోనల్ కమిషనర్లతో సమావేశమైన సీఎం.. వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.
"క్యూర్ పరిధిలో సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా చేశాం. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని నిర్ణయించాం. జోనల్ కమిషనర్లు ప్రతిరోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందే. జోన్ల వారీగా సమస్యలు పరిష్కరించే బాధ్యత కమిషనర్లదే. నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ. నెలకు 3 రోజులు పారిశుద్ధ్య పనుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. నగరగంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించేలా చర్యలు చేపట్టాలి. క్యూర్ పరిధిలో డీజీల్ బస్సులు, ఆటోల స్థానంలో విద్యుత్ వాహనాలు తీసుకురావాలి. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలి. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నరెన్స్‌కు మారాలి. జనవరి నుంచి నాలాల పూడికతీత పనులు చేపట్టాలి. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు బాధ్యత తీసుకోవాలి" అని ఆదేశించారు.

## దుర్గం చెరువు ఆక్రమణలకు చెక్ పెట్టిన హైడ్రా



హైదరాబాద్: నగరంలోని దుర్గం చెరువు ఆక్రమణలకు హైడ్రా అధికారులు చెక్ పెట్టారు. మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ వైపు దుర్గం చెరువులో దాదాపు 5 ఎకరాల మేర ఉన్న ఆక్రమణలను హైడ్రా సిబ్బంది మంగళవారం తొలగించారు. చెరువులో మట్టితో నింపి వాహనాల పెయిడ్ పార్కింగ్ కోసం వినియోగించి ప్రతి నెలా రూ.50 లక్షల వరకూ అద్దెలు వసూలు చేస్తున్న దందాకు తెరదించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని ఆక్రమణలను తొలగించారు. అక్కడి వాహనాలను ఖాళీ చేయించి ప్రస్తుతానికి ఫెన్సింగ్ వేశారు. తర్వాత మట్టిని తొలగిస్తామని అధికారులు తెలిపారు. కబ్జాల పర్వంపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు.ఐటీ కారిడార్‌లో ఒకప్పుడు 160 ఎకరాల మేర ఉన్న ఈ చెరువు ప్రస్తుతం 116 ఎకరాలుగా మిగిలిపోయింది. చెరువుకు ఉత్తర దిశ మినహా.. మూడువైపులా ఆక్రమణలకు గురైంది. కబ్జాల పర్వం ఎలా సాగిందో ఎన్ఆర్ఎస్‌సీ అందించిన శాటిలైట్ చిత్రాలు కళ్లకు కదుతున్నాయి.

## తెలంగాణలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

హైదరాబాద్: తెలంగాణలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్లుగా జి.శ్రీజన, టి.వినయ్ కృష్ణారెడ్డి నియమితులయ్యారు. నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి నిజామాబాద్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. నల్గొండ జిల్లా కలెక్టర్‌గా బడుగు చంద్రశేఖర్, నారాయణపేట అడిషనల్ కలెక్టర్‌గా ఉమాశంకర్ ప్రసాద్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.
వాణిజ్య పన్నుల శాఖలో భారీగా బదిలీలు
వివిధ హోదాలకు చెందిన 21 మంది అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాణిజ్య పన్నులశాఖ అధికారులను వివిధ డివిజన్లకు బదిలీ చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. హైదరాబాద్ రూరల్ ఏజేసీగా రాజేశ్ కుమార్, పంజాగుట్ట ఏజేసీగా సుధామల్లు రజిని, సికింద్రాబాద్ ఏజేసీగా శ్రీలక్ష్మి మంగళదీప్తి నియమితులయ్యారు.

# తిరుమలలో ఆధ్యాత్మిక పరిమళాలు

మొదటి పేజీ తరువాయి

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. భక్తుల కిటకిట, విఐపిల రాకతో తిరుమల సందడిగా మారింది. కుసుమాల సువాసనలు, పరిమళాలతో అంతగా శోభాయమానంగా ఉంది. పూల అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. దీనికితోడు గోవింద నామస్మరణాలతో ఆధ్మాత్మికత ఉట్టిపడుతోంది. స్వామి దర్శనం కాకున్నా మాడవీధుల్లో భక్తులు సందడిగా కనిపించారు. ఈ క్రమంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వర్ణ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రథంపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఊరేగుతూ భక్తులకు అభయప్రదానం చేశారు. దీంతో స్వర్ణరథం వద్ద కోలాటాలు, భజనలు, హారతలు ఆకట్టుకున్నాయి. మరోవైపు ఉత్తర ద్వార దర్శనం కోసం పెద్ద ఎత్తున భక్తులు తిరుమలకు తరలివస్తున్నారు. దీంతో కొండపై రద్దీ నెలకొంది.

# గోదావరి- బనకచర్లపై గట్టిగా పోరాడింది మేమే: హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి

సమావేశానికి వెళ్లనని చెప్పిన సీఎం.. మీటింగ్‌కు వెళ్లి సంతకం చేశారు. కేంద్ర జలవనరులశాఖ సమావేశం అజెండాలో గోదావరి-బనకచర్ల అంశం ఉంది. సమస్య పరిష్కారానికి ఇరు రాష్ట్రాలు కలిసి కమిటీ వేసుకుని ముందుకువెళ్తాయని ఏపీ మంత్రి చెప్పారు. సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి తల ఊపి బయటికి వచ్చి ప్రజలకు అబద్ధాలు చెప్పారు. బనకచర్లపై ముందుకు వెళ్లే విషయంలో ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు కమిటీలు వేశాయి.చంద్రబాబు కమిటీ వేసిన వారానికే రేవంత్‌రెడ్డి కూడా ఒక కమిటీ వేశారు. చంద్రబాబు అనుకూల అధికారి ఆదిత్యనాథ్‌దాస్ నేతృత్వంలో ఏడుగురితో రేవంత్‌రెడ్డి కమిటీ వేశారు. రేవంత్‌రెడ్డి వేసిన కమిటీలో ఆరుగురు ఏపీతో సంబంధం ఉన్నవారే ఉన్నారు.
బనకచర్లను ఏపీ ప్రభుత్వం ఎందుకు వెనక్కు తీసుకుందో కూడా ఈ ప్రభుత్వానికి తెలియదు. గోదావరి నీళ్లు కృష్ణాలో కలిపితే.. ఆ మేరకు మనకు అదనంగా నీళ్లు ఇవ్వాల్సి ఉంటుంది. గోదావరి-బనకచర్లపై కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు లేఖలు రాశాయి. 64 టీఎంసీలు కోరుతూ కర్ణాటక, 21 టీఎంసీలు కోరుతూ మహారాష్ట్ర లేఖ రాశాయి. ఆ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు లేఖలు రాయడంతో బనకచర్లపై ఏపీ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. గోదావరిని కృష్ణాలో కలపకుండా నల్లమల సాగర్‌లో కలపాలనేది ఏపీ సీఎం చంద్రబాబు ఆలోచన. బచావత్ ట్రైబ్యునల్ నుంచి తప్పించుకునేందుకు మరో రూపంలో ఏపీ ప్రాజెక్టుచేపడుతోంది. గోదావరి-నల్లమల సాగర్‌కు ఏపీ ప్రభుత్వం టెండర్లు కూడా వేసింది. టెండర్ల గడువు ముగిసిన తర్వాత ఈ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. ఒప్పుకొని కమిటీ వేశాక.. సుప్రీంకోర్టులో కేసు వేస్తే ఏం ప్రయోజనం. ఏపీ చేపడుతున్న ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు రెండు రకాలుగా నష్టం" అని హరీశ్‌రావు వివరించారు.

# కోనసీమ అభివృద్ధిపై పవన్ కళ్యాణ్ దృష్టి

సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ అధికారులతో సుదీర్ఘ చర్చలు జరిపినట్లు వివరించారు. కేవలం 34 రోజుల్లోనే ఈ పనుల నిర్వాహణకు నిధులు కేటాయించామని చెప్పుకొచ్చారు. కొబ్బరి చెట్లకు నష్టం కలుగకుండా సంరక్షణ చర్యలు చేపడతామని అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.4 వేల కోట్లతో పంట కాలువలు, మురుగు కాలువలు ఆధునీకీకరిస్తామని తెలిపారు. కోనసీమ ప్రాంతనీలో కోకో బోర్డు ఏర్పాటు చేయడానికి కేంద్రప్రభుత్వంతో సంప్రదిస్తామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## కొత్త జిల్లాల ఏర్పాటుపై నోటిఫఙకేషన్ జారీ

మొదటి పేజీ తరువాయి

కొత్త జిల్లాల ఏర్పాటుతో ఏపీలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి పెరిగింది. ఈ మార్పులు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. అలాగే అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లి మారనుంది. ఈ మార్పుల ద్వారా జిల్లా పరిపాలన, రెవెన్యూ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వం అనుకుంటుంది. ఈ నిర్ణయం గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సమగ్ర సేవలందించడానికి తీసుకున్నదాని ఏపీ ప్రభుత్వం పేర్కొంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో పౌరుల సేవల చేరిక వేగవంతం అవుతుందని... రెవెన్యూ డివిజన్ల మార్పులు, చేర్పులు స్థానిక అధికారుల ప్రవర్తనను మరింత సమర్థవంతంగా చేస్తాయని భావిస్తోంది. తుది నోటిఫికేషన్ ప్రకారం, రేపటి నుంచి కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల మార్పులు అధికారికంగా అమల్లోకి రానున్నాయి. ప్రజలు, స్థానిక సంస్థలు, అధికారులు అన్ని విధాలుగా ఈ మార్పులకు అనుగుణంగా తమ కార్యక్రమాలను సర్దుబాటు చేసుకోవాల్సి ఉంది. ఈ కొత్త ఏర్పాట్లు ఏపీలో పరిపాలనలో మరింత సమర్థత, ప్రజల చేరికలో సౌలభ్యం, స్థానిక అభివృద్ధికి దోహదపడతాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఏపీలో కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు సమగ్ర సేవలు, వేగవంతమైన పరిపాలన, వనరుల సమర్థవంతమైన వినియోగం అందించగలిగే అవకాశాలు పెరుగుతాయని ఏపీ సర్కార్ అనుకుంటుంది. మార్పుల్లో నందిగామ మండలాన్ని పలాస రెవెన్యూ డివిజన్ నుంచి టెక్కలి రెవెన్యూ డివిజన్‌కు మార్చారు. సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దపురం డివిజన్‌కు మారుస్తూ ఏపీ సర్కార్ కీలక మార్పులు చేసింది. అలాగే, పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా రీస్ట్రక్చర్ చేయడం, పెనుగొండను వాసవీ పెనుగొడుగా మార్చడం వంటి మార్పులు కూడా నోటిఫికేషన్‌లో చేర్చింది. అనకాపల్లి జిల్లాలో అడ్డరోడ్డు జంక్షన్ రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయడం, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మండలాల సరిహద్దులను మార్చడం ద్వారా స్థానిక పరిపాలన మరింత సులభతరం అవుతుందని కూటమి ప్రభుత్వం భావించింది.

# చంద్రబాబు చరిత్ర రాయాలంటే పేజీలు సరిపోవు

మొదటి పేజీ తరువాయి

సీఎంగా 15 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమన్నారు.అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ దేశాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో కూడా ఆయన పాత్ర కీలకమని చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఏపీ, విభజన ఏపీ అబివృద్ధిలో చంద్రబాబు ప్రస్తావన లేకుండా చరిత్ర లేదన్నారు. ఎంత కోపం ఉన్నా.. ఎంత పని ఒత్తిడి ఉన్నా.. ముఖంలో కనిపించకుండా పని చేసే ఏకైక నేత చంద్రబాబు అని కొనియాడారు. చంద్రబాబు జీవితమే పెద్ద చరిత్ర అని.. దేశంలోనే ఆయనది ప్రత్యేక స్థానమని చెప్పుకొచ్చారు. దేశంలో నదుల అనుసంధానం చేయాలని అనేక మంది ప్రధానులు కలలుగంటున్నారని.. చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రిగా కృష్ణా, గోదావరి నదులను అనుసంధానం చేసి చూపించారని తెలిపారు.
చంద్రబాబు ప్రవేశ పెట్టిన అనేక పథకాలు నేడు కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుని దేశం మొత్తం కూడా అమలు చేస్తోందన్నారు. రాష్ట్రం అబివృద్ధి చెందాలన్నా, సంక్షేమం ముందుకు వెళ్లాలన్నా చంద్రబాబు వల్లే సాధ్యమని వెల్లడించారు.

# సంస్కరణల ఎక్స్‌ప్రెస్'లో భారత్ ప్రయాణం

మొదటి పేజీ తరువాయి

దేశాభివృద్ధికి మరింత ఊతమిచ్చాయి. వికసిత్ భారత్ నిర్మాణానికి ఇవి దోహదపడుతున్నాయి" అని మోదీ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. జీఎస్టీ సంస్కరణలు, బీమా రంగంలో 100శాతం ఎఫ్‌డీఐ, లేబర్ కోడ్‌లు, న్యూక్లియర్ ఎనర్జీ కోసం శాంతి చట్టం, 'వీబీ జీ రామ్ జీ' వంటి ఘటనలను ప్రధాని ఈ సందర్భంగా ఉదహరించారు.
వస్తు సేవల పన్నులో రెండు శ్లాబులను తొలగిస్తూ కీలక సంస్కరణలు చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 5శాతం, 18శాతం శ్లాబులను అమలు చేస్తున్నారు. దీని వల్ల కోట్లాది కుటుంబాలపై భారం తగ్గడమే గాక, గిరాకీ పెరిగిందని మోదీ గుర్తుచేశారు. ఇక, ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.12లక్షలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం.. వేతన జీవులకు ఊరట కల్పించడంతో పాటు మార్కెట్లో వినిమయాన్ని పెంచిందని తెలిపారు.

# అమిత్‌షా వ్యాఖ్యలను ఖండించిన మమతాబెనర్జీ

మొదటి పేజీ తరువాయి

బెంగాల్‌పై కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు . రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతుండడంతో బెంగాల్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు విస్తరిస్తున్నాయని అమిత్ షా అన్నారని మమత పేర్కొన్నారు. ఉగ్రవాదులు ఇక్కడ ఉంటే పహల్గాం, దిల్లీలో ఉగ్రదాడులు చేసింది ఎవరని ప్రశ్నించారు.బెంగాల్ ప్రభుత్వం స్థలం ఇవ్వకపోవడం వల్లే సరిహద్దుల్లో కంచె నిర్మించలేకపోతున్నామని అమిత్ షా చేసిన వ్యాఖ్యలను మమత ఖండించారు. పెట్రాపోల్, చంగ్రబంధ సరిహద్దుల్లో ఇప్పటికే తమ ప్రభుత్వం భూమిని ఇచ్చిందన్నారు. తాము స్థలాన్ని ఇవ్వడం వల్లే రాష్ట్రంలో అన్ని రైల్వే ప్రాజెక్టులు వచ్చాయన్నారు. భాజపా నేతలు చెప్పే అబద్ధపు మాటలను బెంగాల్ ప్రజలు నమ్మరన్నారు. తమ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కేంద్రం 'ఎస్ఐఆర్' పేరుతో కుట్ర పన్నుతోందని వ్యాఖ్యానించారు.
సర్ ప్రక్రియను ఇంత హడావిడిగా చేపట్టాల్సిన అవసరం ఏముందని కేంద్ర ప్రభుత్వాన్ని మమత ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక ఎందరో బీఎల్‌వోలు, అధికారులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణల్లో భాగంగా ఓటర్ల జాబితాలో 1.5 కోట్ల మంది పేర్లను తొలగించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇందులో రాష్ట్రంలోని ఆదివాసీలు, అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు.

## బెంగాల్ సర్కార్ వల్లే సరిహద్దుల్లో కంచె వేయలేకపోతున్నాం: అమిత్ షా

మొదటి పేజీ తరువాయి

వీటివల్ల మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2026 ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపానే అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే సరిహద్దుల వద్ద చొరబాట్లను ఆపుతామని.. అక్రమ వలసదారులను బెంగాల్ నుంచి తరిమికొడతామని హామీ ఇచ్చారు. హింసాత్మక రాజకీయాలను సృష్టించడంలో వామపక్షాలను టీఎంసీ అధిగమించిందని అమిత్‌షా అన్నారు. మమత పాలనలో రాష్ట్రంలో హింస, అవినీతి రాజ్యమేలాయని..ఆమె అవినీతి వల్లే 15 ఏళ్లుగా బెంగాల్ అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు కూడా ఇక్కడి ప్రజలకు అందకుండా టీఎంసీ పార్టీ అడ్డుపడుతోందని ఆరోపించారు. ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలంటే భాజపాను గెలిపించాలని ప్రజలను కోరారు. తాము అధికారంలోకి వస్తే బెంగాల్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉద్యోగాలు కల్పిస్తామని..రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని హామీ ఇచ్చారు.

# సంక్రాంతికి మరో 11 ప్రత్యేక రైళ్లు: దక్షిణ మధ్య రైల్వే

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సంక్రాంతి పండగకు దక్షిణ మధ్య రైల్వే మరికొన్ని ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. ఇప్పటికే ప్రకటించిన రైళ్లకు అదనంగా మరో 11 ట్రైన్లను నడపనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. జనవరి 7 నుంచి 12వ తేదీ మధ్య కాకినాడ-వికారాబాద్, వికారాబాద్-పార్వతీపురం, పార్వతీపురం-వికారాబాద్, పార్వతీపురం-కాకినాడ టౌన్, సికింద్రాబాద్-పార్వతీపురం, కాకినాడ టౌన్-వికారాబాద్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. ఆయా రైళ్లలో 1ఏసీ, 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్ కోచ్‌లతో పాటు సెకండ్ క్లాస్ కోచ్‌లు కూడా అందుబాటులో ఉంటాయయని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఆయా రైళ్లకు బుకింగ్స్ ప్రారంభమయ్యాయని పేర్కొంది. రైళ్ల వివరాలు ఇవీ..ం

# గ్రూప్-1 కేసులో ముగిసిన వాదనలు.. జనవరి 22న తీర్పు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: గ్రూప్-1 ఫలితాలను రద్దు చేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ టీజీపీఎస్సీతోపాటు పలువురు ఉద్యోగులు దాఖలు చేసిన అప్పీళ్లపై హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరు వైపులా వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం జనవరి 22న తీర్పు వెల్లడిస్తామని తెలిపింది.
టీజీపీఎస్సీ తరపున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరీక్షలు జరిగాయన్నారు. మూల్యాంకనంలో అవకతవకలు జరగకూడదన్న లక్ష్యంతో ఇద్దరి చేత చేయించారని తెలిపారు. పరీక్ష కేంద్రాల పెంపు, పరిపాలనాపరమైన సౌలభ్యం కోసం ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు హాల్‌టికెట్లను వేర్వేరుగా జారీ చేసిందని చెప్పారు. పరీక్షల్లో కాపీయింగ్ జరిగిందని ఎలాంటి ఆరోపణలు లేవని వెల్లడించారు. అర్హత సాధించిన అభ్యర్థుల తరపున సీనియర్ న్యాయవాది డి.ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పరీక్షల్లో అర్హత సాధించలేనివారు కోర్టును ఆశ్రయించారన్నారు. రెండు హాల్‌టికెట్లు ఉంటాయని పరీక్షలకు ముందే వెల్లడించినా అప్పుడు అభ్యంతరం చెప్పకుండా, ఫలితాలు విడుదలయ్యాక పిటిషన్ వేయడం చెల్లదన్నారు.

# తిరుపతి ఆలయాల్లో భక్తుల రద్దీ

మొదటి పేజీ తరువాయి

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. దీంతో క్యూలైన్లు అన్ని వైపులా భక్తులతో కిక్కిరిసిపోయాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణలతో మార్మోగింది. అదే విధంగా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు పోటెత్తారు. దీంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

# యూకే హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు ఎంపికైన

## తెలంగాణ బిడ్డ ఉదయ్ నాగరాజుకు ఘన సత్కారం

**సందేశం టైమ్స్ : హనుమకొండ, డిసెంబర్ 29 (సోమవారం):**

యూకే పార్లమెంటు హౌస్ ఆఫ్ లార్డ్స్ (రాజ్యసభ) శాశ్వత సభ్యుడిగా ఎంపికైన తెలంగాణ బిడ్డ ఉదయ్ నాగరాజుకు హనుమకొండ నగరానికి చెందిన పలువురు ప్రముఖులు ఘనంగా సత్కరించారు. సోమవారం ఉదయం సబేదారి ఆఫీసర్స్ క్లబ్ వేడుకల మందిరంలో ఈ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. ఈ సత్కార సభను ప్రముఖ న్యాయవాది వద్దిరాజు వెంకటేశ్వరరావు, గణేశ్ సారథ్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ మాట్లాడుతూ భారత సంతతికి చెందిన తెలంగాణ వాసి ఉదయ్ నాగరాజు యూకే చట్టసభ హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు శాశ్వత సభ్యుడిగా ఎంపిక కావడం దేశానికే గర్వకారణమన్నారు. విదేశీ చట్టసభల్లో మన సంతతి వారు ప్రాతినిధ్యం వహించడం వల్ల అంతర్జాతీయ సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. కఠినమైన శ్రమ, దీక్ష ఉంటేనే ఇలాంటి అవకాశాలు లభిస్తాయని ఆమె పేర్కొన్నారు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే




సతీష్ కుమార్ మాట్లాడుతూ, హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా ఉదయ్ నాగరాజు నిర్వహించాల్సిన బాధ్యతలు, విధులపై వివరించారు. ఉదయ్ నాగరాజు చిన్నతనం నుంచే విద్యతో పాటు రాజకీయాలపై ఆసక్తి కనబరిచారని, వరంగల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిగా చురుకైన పాత్ర పోషించేవారని తెలిపారు. సభలో ప్రసంగించిన పలువురు వక్తలు ఉదయ్ నాగరాజు యూకేలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఉదయ్ నాగరాజు, ఆయన సతీమణి గౌరిలను సంప్రదాయబద్ధంగా ఘనంగా సత్కరించారు. సన్మానానికి ప్రతిస్పందించిన ఉదయ్ నాగరాజు మాట్లాడుతూ తాను నక్కలగుట్ట ప్రాంతంలో నివసిస్తూ వరంగల్ పబ్లిక్ స్కూల్, సెయింట్ పీటర్స్ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసినట్లు గుర్తు చేశారు. పాఠశాల గురువులు అందించిన విలువైన బోధన తన విద్యా, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడిందన్నారు. తన కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉండటంతో పాటు, స్వర్గీయ తండ్రి హనుమంతరావు, పెద్దనాన్న రఘురామారావు ఎన్నికల సమయంలో ప్రముఖ రాజకీయ కుటుంబాలకు సేవలు అందించారని, అందువల్ల చిన్ననాటినుంచే రాజకీయాలపై ఆసక్తి పెరిగిందన్నారు. రాంటెక్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసి, యూకేలో డబుల్ డిగ్రీ సాధించిన అనంతరం అక్కడ ఉద్యోగం చేస్తూనే ప్రధాన రాజకీయ పార్టీల పనితీరును అవగాహన చేసుకున్నానన్నారు. లేబర్ పార్టీలో చేరి గత పదేళ్లుగా పార్టీ నిర్మాణానికి కృషి చేసిన ఫలితంగా, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభించిందని, స్వల్ప ఓట్ల తేడాతో ఓడినా తన సేవలను గుర్తించి హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు ఎంపిక చేశారని తెలిపారు. ప్రతి దశలో సతీమణి గౌరి అందించిన ప్రోత్సాహం, బంధుమిత్రుల సహకారం మరువలేనిదన్నారు. రాజరిక పాలన ఉన్న యూకేలో ప్రభువులు, ప్రభుత్వానికి మధ్య కీలక విషయాల్లో హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుల పాత్ర ఎంతో ముఖ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు మదన్ మోహన్ పి.వి., శివకుమార్ పిన్న, జాతీయ అధ్యక్షుడు పి.వి. రావు, బీజేపీ నేతలు రావు పద్మ, అమరేందర్, ఐటీడీఏ మాజీ పీవో చక్రధర్ రావు, రిటైర్డ్ జడ్జి కల్వల దేవి ప్రసాద్, కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్, ఏఓయూ మాజీ ఉపకులపతి సీతారామారావు, లయన్ వెంకటరెడ్డి, మనోహర్ రావు, డా. శ్రీకాంత్, పింగిళి శరత్, డా. శిరీష్, ఇటుకాల మున్నా, బిల్డర్లు ప్రేమ్ సాగర్, రాజ్ కుమార్, చరణ్, విక్రమ్, కుడా ప్లానింగ్ అధికారి అజిత్ రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# వాయిలసింగారంలో BRS జోరు.. గెలిచిన వార్డు మెంబర్లకు ఘన సన్మానం

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్"

**సందేశం టైమ్స్ :**

అనంతగిరి మండలం వాయిలసింగారం గ్రామంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలుపొందిన వార్డు సభ్యులకు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ నేత బొల్లం మల్లయ్య యాదవ్ ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరవ వార్డు నుంచి దేవులపల్లి నాగరాజు, ఏడవ వార్డు నుంచి బొడ్డుపల్లి ప్రవీణ్ విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో బీఆర్ఎస్ పార్టీపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఈ ఫలితాలే నిదర్శనమని



అన్నారు. వాయిలసింగారం గ్రామంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలందరికీ ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కోదాడ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి గెలిచిన సర్పంచులు, వార్డు సభ్యులను ప్రత్యేకంగా గుర్తు చేస్తూ, భవిష్యత్తు పూర్తిగా బీఆర్ఎస్ పార్టీకే చెందిందని బొల్లం మల్లయ్య యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు ఎవ్వరూ కూడా ఎలాంటి బెదిరింపులకు, ప్రలోభాలకు లోనుకాకుండా పార్టీతో కలిసి నిలవాలని పిలుపునిచ్చారు.
రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ఇప్పటి నుంచే కసరత్తు చేయాలని సూచించారు. పార్టీ కార్యకర్తలను ఎవరైనా బెదిరించినా లేదా ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నించినా వెంటనే పార్టీ నాయకత్వానికి తెలియజేయాలని అన్నారు.
దేవులపల్లి నాగరాజు, బొడ్డుపల్లి ప్రవీణ్‌లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతూ, వాయిలసింగారం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీని మరింత ముందుకు తీసుకువెళ్లి బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. "నేటి పోరులే రేపటి నాయకులు" అని పేర్కొంటూ, యువత అంతా కూడా బీఆర్ఎస్ పార్టీలో చేరి పార్టీ అభివృద్ధికి భాగస్వాములు కావాలని బొల్లం మల్లయ్య యాదవ్ పిలుపునిచ్చారు.

# పనిప్రదేశాల్లో మహిళల రక్షణే లక్ష్యం POSH చట్టంపై అవగాహన

## కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కే. సీతారామారావు"

**సందేశం టైమ్స్ :**

పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణం కల్పించడం ప్రతి సంస్థ బాధ్యత అని అదనపు కలెక్టర్ కే. సీతారామారావు స్పష్టం చేశారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ, నిషేధము మరియు పరిష్కార చట్టం (2013)పై అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళలు



తమ హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. 10 మందికి పైగా సిబ్బంది ఉన్న ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని, మహిళలు వేధింపులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు. చట్టం 2013 ప్రకారం వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునే నిబంధనలు ఉన్నాయని తెలిపారు. అనంతరం కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఈవో శిరీష మాట్లాడుతూ మహిళలను చులకనగా చూడటం, అసభ్య సైగలు చేయటం, అనుచితంగా తాకటం, సెల్‌ఫోన్ ద్వారా అసభ్య సందేశాలు పంపడం వంటి చర్యలపై బాధితులు ధైర్యంగా కమిటీని ఆశ్రయించవచ్చని, ఫిర్యాదులను రహస్యంగా విచారించి న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి నరసింహారావు, కమిటీ సభ్యులు దయానంద రాణి, శంకర్ నాయక్, జిల్లా ట్రెజరీ అధికారి రవికుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, టీఎన్జీవోస్ జనరల్ సెక్రటరీ దున్న శ్యామ్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణ విజయవంతం 62,887 రైతుల నుంచి

## 3.27 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు : జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సందేశం టైమ్స్ :**



సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 2025%-%26 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణను ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో భాగంగా, ఐకెపి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మెప్మా, ఎఫ్‌పీఓల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 348 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లా వ్యాప్తంగా 62,887 మంది రైతుల నుంచి 2,27,320.560 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం, 1,00,258.720 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం కలిపి మొత్తం 3,27,579.280 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఇందుకు గాను రైతులకు మద్దతు ధర కింద రూ.782.59 కోట్లను, అదనంగా బోనస్‌గా మరో రూ.113.65 కోట్లను చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఖరీఫ్ ధాన్యం సేకరణను సజావుగా పూర్తి చేయడంలో సహకరించిన సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ, మెప్మా, పీఏసీఎస్ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

# నూతన సంవత్సరం వేడుకల పేరుతో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

**– జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్"**

**సందేశం టైమ్స్ : సంగారెడ్డిజిల్లా ప్రతినిధి30డిసెంబర్**



నూతన సంవత్సరం వేడుకల పేరుతో ప్రజాశాంతి, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ హెచ్చరించారు. డిసెంబర్ 31 సాయంత్రం నుంచే జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని, మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులపై కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నూతన సంవత్సరం వేడుకలకు డీజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే డీజేలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 30, 30ఏ పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ముందస్తు అనుమతుల్లేకుండా సభలు, నైట్ పార్టీలు నిర్వహించరాదని, ప్రజలు కుటుంబ సభ్యులతో సంతోషకరమైన వాతావరణంలో నూతన సంవత్సరాన్ని జరుపుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్లు గమనిస్తే వెంటనే డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ నెంబర్ 8712656739కు సమాచారం అందించాలని కోరారు.

# ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ దంపతులు

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 30డిసెంబర్**



రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దంపతులు మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో ఉన్న ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం వైకుంఠ పురం శ్రీ వెంకటేశ్వర దేవాలయం లో వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి పల్లకి సేవలో భక్తులతో కలసి పాల్గొన్నారు. దేవాలయం అభివృద్ధికి, రాజగోపురం నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.

# వ్యవసాయ సబ్సిడి పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

**–గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు ఉప్పు శంకరప్ప**

**సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి డిసెంబర్ 30**



మెదక్ జిల్లా టేక్మల్ మండలం బొడ్మాట్ పల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం వాటర్ షెడ్ పథకం ద్వారా మంజూరు అయిన వ్యవసాయ పరికరాలను గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు ఉప్పు శంకరప్ప, ఉపధ్యక్షుడు బాలయ్య, వాటర్ షెడ్ అధికారి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బీరప్ప, కాంగ్రెస్ కార్యకర్తలు అందోల్ నర్సింలు, అందోల్ శ్రీనివాస్, ఉప్పు శ్రీశైలం, కంకర రవి ,లబ్ధిదారులు కంకర ఆంజయ్య, కంకర మల్లేష్, కంకర సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నరు.

# బోరంచ పాఠశాలలో ఆన్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 39డిసెంబర్ సంగారెడ్డి జిల్లా**



"నారాయణఖేడ్ నియోజకవర్గం, మానూర్ మండల పరిధిలోని బోరంచ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆన్ష ఫౌండేషన్ (పుస్తకార్) ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు నోట్‌బుక్స్ మరియు విద్యా సామాగ్రి పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆన్ష ఫౌండేషన్ పుస్తకార్ వ్యవస్థాపకురాలు శోభా బన్నాలి, ప్రోగ్రామ్ డైరెక్టర్ శ్రుతి హెగ్డే, రాజేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల తరఫున అతిథులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అశోక్ రావు, ఉపాధ్యాయులు శ్రీధర్, విఠల్, కవితతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నరు

జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348
సందేశం టైమ్స్
నిజం దాగదు - వార్త ఆగదు
31-12-2025

# "బిజిలిపూర్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీపై వివాదం గ్రూప్ సభ్యులకేనా?"



**సందేశం టైమ్స్ :** సంగారెడ్డి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 30సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల పరిధిలోని బిజిలిపూర్ గ్రామంలో సర్పంచ్ చక్రాల నాగమణి నర్సింలు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం వివాదాస్పదంగా మారింది. గ్రామ సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు మాత్రమే చీరలు పంపిణీ చేయడం పట్ల మిగతా మహిళలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పలువురు గ్రామ మహిళలు మాట్లాడుతూ"మేము కాంగ్రెస్‌కు ఓట్లు వేయలేదా? గ్రామంలో నివసిస్తున్న మిగతా మహిళలకు చీరలు ఎందుకు అందడం లేదు? గతంలో కేసీఆర్ హయాంలో అందరికీ ఇచ్చారు. ఇప్పుడు ఎందుకు మాకివ్వరు?" అంటూ ప్రశ్నించారు.చీరలు అందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ,"ఇచ్చిన వారితోనే ఓట్లు వేయించుకోండి. మాకు న్యాయం జరగకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన నిర్ణయం తీసుకుంటాం" అంటూ హెచ్చరించడంతో కార్యక్రమ ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.గ్రూప్ సభ్యులకే చీరలు ఇచ్చారన్న ఆరోపణలపై నిర్వాహకుల నుంచి స్పష్టత రాకపోవడంతో గ్రామంలో రాజకీయ చర్చ జోరందుకుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ సమానంగా అందాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో వట్పల్లి మండల మైనార్టీ అధ్యక్షుడు షాపొద్దీన్, మాజీ ఎంపీటీసీ సదానందం, మాజీ సర్పంచ్ పద్మయ్య, ప్రస్తుత సర్పంచ్ చక్రాల నాగమణి నర్సింలు, ఉపసర్పంచ్ లింగన్న గారి శోభ మచ్చేందర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అరుగొండ సంగప్ప, కొమరయ్య, వార్డు సభ్యులు, గ్రామ టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# సీఎం కప్ 2025 క్రీడలు జనవరి 17 నుంచి ప్రారంభం

**గ్రామ పంచాయితీ నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు రిజిస్ట్రేషన్ ప్రారంభం**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 2వ ఎడిషన్ సీఎం కప్-2025 క్రీడా పోటీలు జనవరి 17, 2026 నుండి ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలు గ్రామ పంచాయితీ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు దశలవారీగా నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో గ్రామ పంచాయితీ / మండల / నియోజకవర్గం / జిల్లా స్థాయిల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవలసిందిగా నిర్వాహకులు కోరుతున్నారు.

రిజిస్ట్రేషన్ వివరాలు:

రిజిస్ట్రేషన్ ప్రారంభం: ఈ రోజు నుంచే

అర్హత:

సబ్-జూనియర్ / జూనియర్ / సీనియర్ రిక్రియేషనల్ గేమ్స్ (పిల్లలు ఇతరులు)

పారా గేమ్స్ ఓపెన్ కావలసిన పత్రాలు:

ఆధార్ కార్డు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో రిజిస్ట్రేషన్ విధానం:

ప్రభుత్వం సూచించిన ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే

క్రీడా విభాగాలు:

అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, బాక్సింగ్, రెజ్లింగ్, తైక్వాండో, కరాటే, యోగా, చెస్ తదితర 44 రకాల క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించబడతాయి.

లక్ష్యం:

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసి, రాష్ట్రం నుంచి జాతీయ అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే సీఎం కప్ 2025 ప్రధాన ఉద్దేశ్యం. కాబట్టి అర్హత గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సకాలంలో రిజిస్ట్రేషన్ పూర్తి చేయవలసిందిగా నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అంగన్వాడి కేంద్రాల్లో పరిశుభ్రతను పాటించాలి

**- అంగన్వాడీ సూపర్వైజర్ ఎం.శ్రీలత**



**సందేశం టైమ్స్:** మండలంలోని రేఖ్య తండా అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేసిన పెద్దాముప్పారం సెక్టార్ అంగన్వాడీ(హెల్పర్స్) ఆయాలమీటింగ్ ఏర్పాటు చెయ్యడం జరిగిందఈ కార్యక్రమం లో ఐ సి డి ఎస్ సూపర్ వైజర్ ఎం. శ్రీలత పాల్గొని ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ ఆయాలు అంగన్వాడీ సెంటర్ కు పునాది లాంటి వారని అన్నారు, అంగన్వాడీ కేంద్రాలను పరిశుభ్రం గా ఉంచుకుంటూ పిల్లలకు మంచి ఆహారమును అందించి,పిల్లలను బాలింతలను,గర్భిణీలను కుటుంబ సభ్యులు గా చూసుకోవాలనిఫలు సూచనలు సలహాలు ఇచ్చారు, ఆయాలు చేసే సేవ చాలా గొప్పదని అన్నారు, పిల్లలను, బెనిఫిషర్స్ కు చేసే సేవలుచాలా విలువైనవిగా అభినందించారు, కార్యక్రమంలో సెక్టర్ ఆయాలుపి.వెంకటలక్ష్మి ర్. పద్మా. లక్ష్మి శిల్ప హీరోడి అరుణ పూలమ్మ వెంకటమ్మ నీలమ్మ మీరా మాణిక్యమ్మ నరసమ్మ బుజ్జమ్మతదితరులు పాల్గొన్నారు

# వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**- ముక్కోటి ఏకాదశి రోజున**
**- ఉత్తరద్వార దర్శనం!**
**- ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తరద్వార దర్శనం చేస్తే కలిగే పుణ్య ఫలం ఏమిటి?**




**సందేశం టైమ్స్:** అనంతమైన పుణ్యఫలం అని చెప్పుకోవాలి. భారతీయులు కాంతిని ఆరాధించేటటువంటి వారు. ప్రాఙ్ముఖంగా ప్రయాణించేటటువంటి వారు. దేహంలో ఎప్పుడూ కూడా ఎడమ భాగాన్ని కుడి భాగం నియంత్రిస్తూ ఉంటుంది. వామ భాగం స్త్రీ సంబంధితమైనటువంటి భాగం. ప్రేమ, పారమార్థిక దృష్టి, లౌకిక సుఖములు, ఆనందములు ఇవన్నీ కూడా ఉత్తర దిక్భాగంలో ఉంటాయి. వీటన్నింటినీ నియంత్రించేది ఎడమ భాగం. అలాగే మన దృష్టి కూడా నిరంతరం ఎడమ వైపుకే ప్రసరిస్తూ ఉంటుంది. ఉత్తర దిక్కుకు ధనము, సంపద వంటి వాటికి ప్రాముఖ్యత ఉంది. అన్నింటికంటే మించి ఈ విశాల విశ్వమంతా కూడా తన చుట్టూ తానూ తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరుగుతుంది అనుకుంటే ఈ విశ్వంలో ఉండే అంతర్భాగము అంటారు దానిని. అది దీనికి వ్యతిరేకంగా తిరుగుతూ ఉంటుంది. ఈ విశ్వము దక్షిణం వైపునుంచి ఉత్తరం వైపుకు తిరుగుతూండగా అందులోని అంతర్భాగం ఉత్తరం వైపునుంచి దక్షిణానికి తిరుగుతుంది. "ప్రాగ్ ఆరభ్య దక్షిణేణ వర్తనం" మన హిందూ ధర్మంలో అందుకోసమే ఆలయానికి వెళ్తే ప్రదక్షిణ చేయాలి - ప్రాగ్ ఆరభ్య దక్షిణేన వర్తనం. ఉత్తరంగా, ఈశాన్యంగా, తూర్పుగా, ఆగ్నేయం, దక్షిణం ఇలా ప్రదక్షిణ చేస్తూ ఉంటాం. కనుక ఈ రెండింటి మధ్య ఉండే వైరుధ్యం వల్ల కలిగిన ఆకర్షణ శక్తి చేత మనం ఈ భూమిమీద అంటిపెట్టుకొని ఉన్నాం దానికే భూమ్యాకర్షణ శక్తి అని పేరు.ఈరోజున ఉత్తర దిగ్భాగ మార్గాన్ని అనుసరించి ఇంక రెండు మూడు రోజులలో సూర్యనారాయణ మూర్తి ఉత్తర దిగ్భాగంలో ప్రయాణం చేస్తూంటాడు. ఈరోజున మనం ఉత్తర దిగ్భాగంతో ప్రయాణం ప్రారంభం చేసినట్లయితే తప్పకుండా కైవల్యం లభిస్తుంది. ఈ భూమితో ఉండే ఆకర్షణ సంబంధిత సంబంధాలన్నీ కూడా తొలగిపోయి ఆ శ్రీమన్నారాయణ మూర్తిని చేరుకుంటాము. భవ బంధనాలన్నీ కూడా తొలగిపోతాయి. అనేటటువంటి రహస్యాన్ని కనుగొన్న ప్రాచీనులు ఈ అంశాలన్నీ కూడా శాస్త్రోక్తంగా చెప్తే అందరికీ అర్థం అవుతాయో లేదో అనే ఉద్దేశ్యంతో కథలను జోడించి విభీషణ శరణాగతి కథ, వైకుంఠ ఏకాదశి కథ, ముప్పది మూడు కోట్ల దేవతలతో ఆ స్వామి ఈనాడు మనకు దర్శనమిస్తాడు. మూడు కోట్లతో రంగధాముని దర్శనమిస్తాడు. ఇలా చెప్పి ఆలయాలవైపు మనల్ని మరల్చారు. స్వామి దర్శనం చేసుకోండి అంటూ అనుజ్ఞనిచ్చారు. మన ప్రయత్నం కాకుండా గురువుతో ప్రయత్నం కావాలి. స్వప్రయత్నం కూడదు అంటుంది ధర్మము. కాబట్టి నారాయణుడే అటువంటి మనలో జ్ఞానమును ప్రేరేపించు వాడు. ఆయన ప్రపన్నుడు. అడిగిన వాళ్ళందరికీ కూడా ఆశ్రయం ఇచ్చే ప్రపన్నుడు. ఎవరిని రక్షించాలా? అని సంసిద్ధుడై ఉంటాడుట. కాబట్టి ఉత్తర ద్వార దిశగా మనం ప్రయాణం చేస్తే తప్పకుండా కోరిన కోరికలు నేరవేరుతాయి. అన్నింటికంటే కోరవలసినది ఏమున్నది? - ఈ లోకంతో భవ బంధనాలనుంచి విముక్తి. మోక్షము అంటే "ముచిల్ మోక్షణే" అని అర్థం. బంధనాలనుంచి ముక్తిని పొందడము, విముక్తిని కలిగించుకోవడము అని అర్థం. అందుకే ఉత్తర దిశ ఇంత ప్రాముఖ్యం కలది, ఇంతగా విశేషత ఈ పండుగకు ఉన్నది.సర్వం శ్రీకృష్ణార్పణమస్తు లోకా సమస్తా సుఖినోభవన్తు!


# అసైన్డ్ భూముల కొనుగోలులో కౌన్సిలర్ భర్త అక్రమాలు

**- డబ్బులు చెల్లించకుండా మోసం చేశారని బాధితుడి పిర్యాదు**
**- జిల్లా కలెక్టర్‌కు స్పందించారూ**

**సందేశం టైమ్స్:** ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చిన నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేస్తున్నారనే ఆరోపణలు రోజు రోజు కు పెరుగుతున్నాయి. సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పోతిరెడ్డిపల్లి వార్డు కౌన్సిలర్ భర్త తులసిరాం అసైన్డ్ భూముల కొనుగోలు విషయంలో తీవ్ర అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు నిత్య సత్యంగా వెలువడుతున్నాయి. వివరాల్లో కి వెళ్ళితే బాధితుడు మామిడి పల్లి నారాయణ సోమవారం జిల్లా కలెక్టర్‌కు అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు నారాయణ తండ్రి హనుమయ్య మాట్లాడుతూ సర్వే నంబర్లు 155, 152లో మొత్తం 1 ఎకరం 20 గుంటల అసైన్డ్ భూమి తనకు ఉందని పేర్కొన్నారు. ఈ భూమికి సంబంధించిన ఎన్‌ఓసీ ఇప్పించి కొనుగోలు చేస్తామని కౌన్సిలర్ భర్త తులసిరాం నారాయణను సంప్రదించించారు. ఆది అసైన్డ్ భూమి విక్రయం ఎలా సాధ్యమని నారాయణ ప్రశ్నించగా, రెవెన్యూ అధికారుల అండదండలు తమకు ఉన్నాయని చెప్పి నమ్మబలికారు. ప్రభుత్వం సంబంధించిన విషయాలు నేను చూసుకుంటానని పేర్కొన్నారు. ప్రభుత్వ అసైన్డ్ భూముల కు ఎన్ ఓ సి కల్పించటంలో మా ప్రభుత్వం ఉంది ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆది నేను చూసుకుంటానని తెలిపారు. ఆ అసైన్డ్ భూమికి ఓ క ఎకరం ఇరువై గంటలకు రూ.1 కోటి 50 లక్షలు చెల్లిస్తామని హామీనిచ్చారు.భూమికి సంబంధించిన అన్ని వ్యవహారాలు తామే చూసుకుంటామని చెప్పి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితుడు మామిడి పల్లి నారాయణ పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే డబ్బులు చెల్లిస్తామని చెప్పినప్పటికీ, నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని వాపోయారు.ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలని బాధితుడు కోరారు. సంగారెడ్డి మున్సిపాలిటీ శారవేగంగా అభివృద్ధి చెందటం తో ప్రభుత్వ అసైన్డ్ భూముల పై రాజకీయ పార్టీ ల కౌన్సిలర్ తులజ్జరామ్ కన్ను పడింది. ఇప్పటికే అనేక అసైన్డ్ భూముల్లో ఇండ్లు విల్లాలు కట్టడం జరుగు తుందని నమ్మించారు.ఈ భూముల వ్యవహారంలో అక్రమ లావాదేవీలు జరిగాయా? ఇందులో రెవెన్యూ అధికారుల పాత్ర ఏమిటన్న అంశాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



Prajavani Acknowledgement Receipt
Name :M.Narayana
Address :Sangareddy,Sangareddy,Sangareddy
Village :SANGAREDDY
Mandal :SANGAREDDY
Grievance Subject :Requests
Your Grievance is Registered vide Registration no.SRDDC/... On29-12-2025Please keep the registration number for all future correspondence. Your Grievance is sent to District Collectorate Sangareddy



# ఘనంగా రంగనాథుడికి భక్తుల మొక్కులు.. దర్శనం

**- అందోల్ నియోజకవర్గం లోని వైష్ణవ దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి**
**- ఆందోల్ మండలంలోని కిచ్చనపల్లి అల్లాదుర్గం మండలంలోని గడ్డి పెద్దాపూర్ లో శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శించుకున్నారు**



**సందేశం టైమ్స్:** ముక్కోటి వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని సంతరించుకొని అందోల్ మండలంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. అందోల్ గ్రామంలో కొలువైన శ్రీ భూనీలా సమేత రంగనాథ స్వామి దేవాలయంలో స్వామివారి దర్శనానికి చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు దర్శనానికై క్యూ లైన్ లో వేచి ఉన్నారు. దేవాలయానికి విచ్చేసిన భక్తులకు అక్సాన్ పల్లి గ్రామానికి చెందిన ఆరేటి అరుణ-సుదర్శన్ రెడ్డి,ఆరేటి స్వప్న-సురేందర్ రెడ్డి దంపతులు తులసి మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఇంట తులసి మొక్క ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తులసి మొక్క సాక్షాత్తు లక్ష్మీదేవి స్వరూపమని అనేకమైనటువంటి ఔషధ గుణాలను కలిగి ఉందని ప్రతి ఇంటా తులసి మొక్క నాటాడం ద్వారా అష్టైశ్వర్యాలు పొంది ఆరోగ్యంతో జీవిస్తారనే సదుద్దేశంతో తులసి మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలియజేశారు. అనంతరం ఆలయ పూజారి శ్యామనాథ్ శర్మ మాట్లాడుతూ.. దేశంలోని ఉత్తర ద్వార దర్శనం అంటే ఎంతో పుణ్యఫలం అని ఆయన అన్నారు. ఈ ముక్కోటి ఏకాదశి నాడు ఉత్తర ద్వారా దర్శనం చేసుకుంటే జన్మ ధన్యమవుతుందని.. 3000 కోట్ల మంది దేవతలు ఆశీస్సులు మనపై ఉంటాయని మనం చేసిన తప్పులు.. మనం మొక్కిన కోరికలు నెరవేడుతాయని అయినా అన్నారు. ఈరోజు ప్రత్యేకంగా శ్రీ మహా విష్ణుమూర్తి కి ఉత్తర ద్వారం ద్వార దర్శనం చేసుకుని కోరిన కోరికలు మోక్కుతే అవి తీరుతాయని ఆయన అన్నారు.

# సిర్ పూర్ నుంచి ఇసుక అక్రమ రవాణా: పట్టించుకోని అధికారులు

**సందేశం టైమ్స్:** డోంగ్లి మండలం సిర్ పూర్ మంజీర నది నుంచి రాత్రి సమయంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. కొందరు వ్యాపారులు ఇసుక దందాకు తెరలేపారు. రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు మండల స్థాయి అధికారులకు తెలిసిన పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. హసన్ టాక్లి నుంచి రాత్రి వేళల్లో వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ల వీడియో, పోటోలను స్థానికులు తీసి మన జుక్కల్ న్యూస్ కు పంపించారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.